దర్జాగా గ్రావెల్ డంప్

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇసుక, మట్టి, మైనింగ్ అనుమతులన్నీ తాత్కాలికంగా రద్దవుతాయి. అధికార పార్టీ ఆధిపత్యం ఉండదు. ఇదే అదనుగా టీడీపీ నేతలు మైనింగ్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులను అడ్డం పెట్టుకుని గ్రావెల్ దోపిడీకి బరి తెగించారు. చెరువులు, గ్రావెల్ భూముల్లో రేయింబవళ్లు వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో గ్రావెల్ తవ్వేసి, తమ స్థలాల్లో దర్జాగా డంప్ చేస్తున్నారు. కోడ్ నిబంధనలకు తూట్లు పొడుస్తూ విచ్చలవిడిగా గ్రావెల్ దందా జరుగుతున్నా.. సంబంధిత అధికారుల యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది.

- ఎన్నికల కోడ్ రావడంతో గ్రావెల్ దోపిడీకి టీడీపీ శ్రీకారం
- యథేచ్ఛగా బుడమగుంట చెరువులో గ్రావెల్ తరలింపు
- కోడ్ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా.. సహకరిస్తున్న అధికారులు


బుడమగుంటలో టీడీపీ నాయకుల గ్రావెల్ స్టాక్ పాయింట్

కావలి : కావలి నియోజకవర్గం టీడీపీ నాయకులు ఆ పార్టీ ఐదేళ్ల పాలనలో గ్రావెల్, మట్టి దోపిడీతో చెలరేగిపోయారు. అధికారం కోల్పోవడంతో బిక్క చచ్చిన ఆ పార్టీ నేతలు కొందరు తాజాగా ఎన్నికల కోడ్ వచ్చీరాగానే గ్రావెల్, మట్టి దోపిడీకి తెగబడుతున్నారు. ఎన్నికల తర్వాత ఎలాగో అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, ఎన్నికల కోడ్‌లో అధికార పార్టీ ఆదేశాలను అధికారులు సైతం పట్టించుకోరనే ధీమాతో అక్రమ తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో ఇసుక, మట్టి, గ్రావెల్ తవ్వకాలకు మైనింగ్ అనుమతులు తాత్కాలికంగా నిలిచిపోతాయి. అయితే ఈ సమయంలో అధికార యంత్రాంగందే ఆధిపత్యం కావడంతో టీడీపీద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు తామేం తీసిపోలేదంటూ ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. గ్రావెల్ తవ్వకాలను ఫొటోలు తీసేందుకు ప్రయత్నించిన వలంటీర్లపై దౌర్జన్యానికి దిగుతున్నారు. అక్రమ దందా అరికట్టాల్సిన రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండి పడుతున్నారు.

10 ఎకరాల్లో స్టాక్ పాయింట్

బుడమగుంట చెరువులో టీడీపీ నేతలు పెద్ద ఎత్తున గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 24 గంటలు గడవక ముందే స్థానిక రెవెన్యూ, మైనింగ్ అధికారులతో మాట్లాడుకుని భారీగా తవ్వకాలు చేపట్టారు. భారీ యంత్రాలు, టిప్పర్లు వినియోగించి రాత్రీ పగలూ తేడా లేకుండా తవ్వకాలు సాగిస్తున్నారు. బుడమగుంటలో ప్రధాన రహదారి పక్కనే పది ఎకరాల స్థలంలో స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేసి మరీ గ్రావెల్‌ను స్టాక్ చేస్తున్నారు. ఈ స్టాక్ పాయింట్‌ను గమనించిన రెవెన్యూ అధికారులు గ్రావెల్‌ను త్వరగా అమ్ముకోవాలని, ఉన్నతాధికారులు చూస్తే సమస్యలు వస్తాయని సలహా ఇచ్చినట్లు తెలిసింది. దీంతో రోడ్డుకు దూరంగా మరో గ్రావెల్ డంప్ ఏర్పాటు చేసే పనిలో టీడీపీ నాయకులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రావెల్ తవ్వకాలు నిలిపేయాలని అడ్డుకుంటే టీడీపీ నేతలు బెదిరింపులకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు

రౌడీయిజమే ఆయుధం

టీడీపీ నాయకులు ఈ దఫా ఎన్నికల్లో రౌడీయిజమే ఆయుధంగా, హింసే అజెండాగా పావులు కదుపుతున్నారు. ఆ పార్టీ అభ్యర్థి ఇప్పటికే పలు మార్లు కవ్వింపు చర్యలకు పాల్పడినా వివాదాలు ఎందుకనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంయమనం పాటిస్తున్నాయి. ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటికి తాళాలు వేస్తానని, కావలికి రాకుండా చేస్తానని ఎమ్మెల్యే సన్నిహితులు ఉండే పాతూరుకు వెళ్లి మరీ సవాల్ చేసిన విషయం తెలిసిందే. ఇళ్లకు వచ్చి కొడుతాం అంటూ బాహాటంగానే వార్నింగ్‌లు ఇస్తున్న తీరు స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం

కావలి పట్టణంలోని బుడంగుంట పెద్ద చెరువులో టీడీపీ నాయకులు గ్రావెల్ అక్రమంగా తరలించేది, స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసిన విషయం నా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపించి విచారించి, గనుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. – వీకే శీనానాయక్, ఆర్డీఓ, కావలి



టీడీపీ, జనసేన కకావికలం

- జెండాలు వదిలేస్తున్న టీడీపీ కేడర్
- జనసేన కేడర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న టీడీపీ అభ్యర్థి

కావలి: ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకున్న అసలు సిసలైన టీడీపీ క్యాడర్‌తో పాటు, జనసేన కేడర్ కావలి టీడీపీ అభ్యర్థి పోకడలతో కకావికలం అవుతోంది. అస్తిత్వాన్ని చంపుకుని ఆయా పార్టీల క్యాడర్ ఇమడలేక..జెండాలు వదిలేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కావలి టీడీపీకి నాలుగు దశాబ్దాల్లో ఎంతో మంది లీడర్లు ప్రాతినిధ్యం వహించినా.. కేడర్ మొత్తం వారితో కలిసి పని చేయగలిగారు. అయితే ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డిని అధిష్టానం ప్రకటించిన వెంటనే ఆత్మాభిమానంతో బతికుతున్న కేడర్ పార్టీని వీడి బయటకు వచ్చారంటే ఆ పార్టీలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పార్టీ ఇన్‌చార్జ్‌లు ఏ నేత వచ్చినా.. ఆ నేతను ఆసాంతం నాకేసే 'చిల్లర' క్యాడర్ మాత్రం టీడీపీలోనే కొనసాగుతోంది. ప్రస్తుతం టీడీపీలో ఆది నుంచి కొనసాగుతున్న లీడర్లకు పట్టుమని పది ఓట్లు వేయించే శక్తి లేదు. కేవలం అభ్యర్థి ఎన్నికల ఖర్చులను దిగమింగే రకాలు తప్ప. వీరికే ఓట్లు వేయించే శక్తి ఉంటే.. కావలిలో టీడీపీ వరుసగా రెండు ఓటమి చెందేదా? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నలు సంధిస్తున్నారు. రౌడీషీటర్లను, క్రిమినల్స్‌ను, నేరచరిత్ర ఉన్న వాళ్లను అల్లరి మూకలతో టీడీపీ పార్టీని నింపేస్తుండటంతో అసలైన కార్యకర్తలు, నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

జెండా ఎత్తేసిన జనసేన

కావలి జనసేనలో చివరికి పట్టుమని పది మంది కూడా లేకుండా పోయారు. పొత్తులో భాగంగా టీడీపీకి జైకొట్టిన లీడర్లకు టీడీపీ అభ్యర్థి పార్టీ కండువాలు కప్పేసి జెండా ఎత్తేసేలా వ్యవహరించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు అస్తిత్వాన్ని చంపుకుని టీడీపీకి పని చేస్తున్న పవన్ అభిమానులను టీడీపీ అభ్యర్థి కుక్కలకన్నా హీనంగా చూస్తూ అవమానిస్తున్నాడని, వార్డుల వారీగా జనసేన కార్యకర్తలను, పవన్ అభిమానులను జనసేన జెండా వదిలి టీడీపీలో చేరితేనే మర్యాద ఉంటుందని హుంకరిస్తున్నాడని ఆ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అలహరి సుధాకర్ ఇటీవల మంగళగిరిలో నాగబాబును, నాదెండ్ల మనోహర్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్నాడు. కార్యకర్తలను కాపాడాలని మొరపెట్టుకోవడంతో విషయాన్ని పవన్ దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. కావ్య వైఖరితో ఇప్పటికే టీడీపీ అభిమానులు, సీనియర్ నాయకులతో పాటు జనసేన కేడర్ కూడా ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న విషయం తెలిసిందే.

కావ్య క్వారీల కథ తేలుస్తాం

- హద్దు మీరితే కావలి ప్రజలు ఉపేక్షించరని హెచ్చరిక
- రౌడీయిజం చూపిస్తే తరిమికొడుతారు


విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రౌడీమూకల నాయకుడు కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అక్రమ క్వారీల కథకు త్వరలోనే ముగింపు పలకనున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన కావలిలో విలేకరులతో మాట్లాడుతూ కావ్య అవినీతి, వ్యవహారంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రౌడీమూకలు, అల్లరి గ్యాంగ్‌లతో వచ్చి బెదిరిస్తే బెదిరిపోవడానికి కావలి ప్రజలు పిరికివారు కాదన్నారు. అన్నవరంలో అమాయకులను బెదిరించినట్లు కావలిలో బెదిరిస్తే తోలు ఊడిపోయేలా తరిమి తరిమి కొడుతారని హెచ్చరించారు. అన్నవరంలో ఏడెకరాలు లీజుకు తీసుకుని వందల ఎకరాల్లో కంకర క్వారీలు ఏర్పాటు చేసి అక్రమంగా తవ్వకాలు జరపడంపై అధికారుల వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయన్నారు. క్రషర్ కరెంట్ బిల్లుల ఆధారంగా అధికారులు పక్కాగా విచారణ జరిపి రూ.140 కోట్లు పెనాల్టీ విధిస్తే కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్న విషయం ప్రజల ముందు ఉంచుతామన్నారు. అక్రమ తవ్వకాల కేసులో కావ్య కృష్ణారెడ్డి త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ప్రశాంతంగా ఉండే కావలిలో రౌడీ రాజకీయం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కావలికి వచ్చి తొడలు కొట్టడం, చిల్లర మాటలు మాట్లాడటం, రౌడీయిజం చెలాయించాలని చూడడం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. కావ్య పాపాలు పండే రోజులు త్వరలోనే ఉన్నాయన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు

వైఎస్సార్‌సీపీలో యువత చేరిక


పార్టీలో చేరిన యువతకు కండువాలు వేసిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని 36వ వార్డుకు చెందిన వివిధ పార్టీల యువకులు స్వచ్ఛందంగా సోమవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి తరలివచ్చి వైఎస్సార్‌సీపీలో చేరారు. సమాధి అశోక్, ఎటగిరి కామయ్య, జయంపు ఉదయ్, కొండ శశి, కమల్, గెండి లోకేష్, తాళ్ల చందు తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. యువకులు మాట్లాడుతూ కావలి అభివృద్ధికి నిస్వార్థంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడి వంటి సౌమ్యుడిని కావలి ప్రజలు వదులుకోకూడదన్నారు. కావలి ప్రాంతంగా ఉండాలంటే అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా యువత ప్రతాప్‌న్నను గెలిపించుకోవాలని కోరారు. టీడీపీ అభ్యర్థి కావ్య వంటి వ్యక్తి గెలిస్తే ఏమవుతుందో, జలదంకి మండలం అన్నవరం ప్రజలను అడిగితే తెలుస్తోందన్నారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి జగనన్నను గెలిపించాలని విస్తృత ప్రచారం చేస్తామని ప్రతినబూనారు.

28 నుంచి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం


పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- వరుసగా రెండు సార్లు ప్రారంభించిన చోటే మూడోసారి కూడా..

కావలి: ఈ నెల 28వ తేదీ నుంచి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరాలు తెలియజేసే ప్రచార కరపత్రాన్ని సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మండలంలోని పెద్ద పట్టపుపాళెం పంచాయతీ నందెమ్మపురంలో కొలువైన మత్స్యకారులు గ్రామ దేవత నందెమ్మ అమ్మవారికి ఈ నెల 28న ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా 2014, 2019 ఎన్నికల్లో నందెమ్మపురంలో అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ రెండు సార్లు విజయం సాధించడంతో ఆ సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ ఎమ్మెల్యే మూడోసారి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పాల్గొంటారని, నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు డాక్టర్ వైఎస్సార్ అభిమానులు పాల్గొని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు, జంపాని రాఘవులుగౌడ్, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, జనిగర్ల మహేంద్ర యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క మేలు చేయని బాబును నమ్మొద్దు


చింతలపాలెంలో ప్రచార రథంపై ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

- జగనన్నను గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు
- ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: చంద్రబాబు పద్నాలుగా ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ప్రజలకు ఏనాడు ఒక్క మంచి చేయలేని, ఇటువంటి వ్యక్తిని నమ్మి ఓట్లేస్తే మన జీవితాలను మనమే నాశనం చేసుకున్న వారతామని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఏకమై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే..సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరుగుతుందని విజ్ఞప్తి చేశారు. మండలంలోని రామవరప్పాడు, చింతలపాళెంలో సోమవారం విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలతో లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. వైఎస్సార్ రైతుభరోసా, చేయూత, ఆసరా, నేతన్న నేస్తం, కాపు నేస్తం, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న చేదోడు.. ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పారదర్శకతకు పెద్దపీట వేశారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలతో పాటు ఎన్ని పార్టీలు కూటమిగా ఏర్పడి కుట్రలు పన్నినా జగనన్నను తాకలేరని స్పష్టం చేశారు. టీడీపీకి ఓటేస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి నిలిచిపోతాయన్నారు. కరోనా విపత్కర పరిస్థితులు ఒక వైపు, ఆర్థిక ఇబ్బందులు మరో వైపు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జాతీయ స్థాయిలో పేద పిల్లలు రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చి ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి సురేష్, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండరని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యకర్తలకు సేవకుడిగా ఉండే తనను ఆదరించాలని కోరారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని ఫ్యాను గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవెల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనరు తిప్పారెడ్డి ఇందిరమ్మ, నాయకులు రావి ప్రసాద్‌నాయుడు, వంటేరు రామచంద్రారెడ్డి, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, జాజుల మాల్యాద్రి, పులిమి బాబుల్‌రెడ్డి, గుమ్మలంపాటి సుబ్బారావు, కాకాణి మహదేవ, గుమ్మలంపాటి కళ్యాణ్, గట్టుపల్లి సర్పంచ్ కాకాణి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

మేకపాటి విజయమే లక్ష్యంగా పనిచేయాలి


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వరికుంటపాడు: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ ఆలీఅహ్మద్ కోరారు. ఆయన సోమవారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లెలో నాయకులు, కార్యకర్తలతో కలిసి జగనన్న భరోసా, రాజన్న గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమ పథకాలను వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు మళ్లీ కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వరరెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జిలానీ, ఉప సర్పంచ్ మహ్మద్ రసూల్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.శ్రీనివాసులు, నాయకులు ఎం.తిరుపతినాయుడు, జి.మల్లికార్జున, డి.మాలకొండయ్య, ఎం.వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి జైకొట్టిన వడ్డిపాళెం


ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వడ్డిపాళెం వాసులు

కావలి: మండలంలోని రుద్రకోట పంచాయతీలోని వడ్డిపాళెం మొత్తం ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీకి జైకొట్టింది. వడ్డిపాళెం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు అందరూ సోమవారం రాత్రి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి చేరుకుని ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ఐదేళ్లుగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎంతో శ్రమ పడి, కావలికి రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తి చేశారన్నారు. అయితే టీడీపీ కావలికి సంబంధం లేని వ్యక్తులు, రౌడీమూకలతో వస్తుందని, ఆ పార్టీ గెలిస్తే ప్రజలు బతకలేరన్నారు. ప్రజల ప్రాణాలు, భద్రతను, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీకి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా నిలవాని నిర్ణయించుకుని స్వచ్ఛందంగా ఇంటికి ఒకరు చొప్పున వచ్చి పార్టీలో చేరామన్నారు.

వరుడిని ఆశీర్వదించిన మాజీ ఎంపీ మేకపాటి


వరుడిని ఆశీర్వదిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

మర్రిపాడు: మండలంలోని పడమటినాయుడుపల్లికి చెందిన మన్నె వెంటేశ్వరరెడ్డి కుమారుడు వరుణ్ వివాహ కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి హాజరై నూతన వరుడిని ఆశీర్వదించారు. ఆయన వెంట బూదవాడ సొసైటీ చైర్మన్ నారపరెడ్డి సుబ్బారెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, దశరథరామిరెడ్డి, అబ్బిరెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

దైవ ప్రార్థనలతో సామరస్యం వెల్లివిరియాలి

- ఇఫ్తార్ ప్రార్థనల్లో మేకపాటి


ఇఫ్తార్ విందులో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

మర్రిపాడు: రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, ఆనందం వెల్లివిరియాలని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కృష్ణాపురం బీసీ కాలనీలో మసీదులో ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లింతో కలిసి నిర్వహించిన ప్రత్యేక దువాలో రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అన్నారు. సేవా ధృక్పదానికి, సహనానికి ప్రతీకగా ఈ పండగ జరుపుకోవడం ఎంతో సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, దుగ్గిరెడ్డి కృష్ణాప్రసాద్‌రెడ్డి, రాచాల జయరామిరెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం





సంగం: సంగంలోని బాలచౌడేశ్వరిదేవి ఆలయంలో రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారిని పరిమళ పుష్పలతో అలంకరించి మండపంపై కొలువుంచి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు భక్తిశ్రద్ధలతో వ్రతం నిర్వహించారు.

క్లుప్తంగా

అయ్యప్పస్వామికి పూజలు


పడి పూజ నిర్వహిస్తున్న భక్తులు

కలిగిరి: అయ్యప్పస్వామి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం కలిగిరిలో కొలువైన పర్వతవర్ధిని నాగమల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పడి పూజ జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

ఆత్మకూరురూరల్/అనుమసముద్రంపేట: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మంగళవారం ఏఎస్‌పేట మండలంలోని కుప్పురుపాడులో సాయంత్రం 4 గంటల, 6 గంటలకు మండలంలో వాశిలిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని మేకపాటి కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శాస్త్రోక్తంగా శంకుస్థాపన మహోత్సవం


శంకుస్థాపన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మర్రిపాడు: మండలంలోని రాజుపాళెంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థాన పునః నిర్మాణ సోమవారం శాస్త్రోక్తంగా శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి కలశ స్థాపన చేశారు. మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రేపు సర్టిఫికెట్ల పంపిణీ

ఉదయగిరి: పట్టణంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ద్వారా పీఎం విశ్వకర్మ పథకంలో రెండు నెలల క్రితం తాపీ పనిలో ఆరు రోజుల పాటు శిక్షణ పొందిన వారికి బుధవారం స్థానిక నేక్ కార్యాలయంలో సర్టిఫికెట్లు పంపిణీ జరుగుతుందని నిర్వాహకులు లక్కినేని ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందినవారు తప్పనిసరిగా హాజరై సర్టిఫికెట్లు తీసుకెళ్లాలన్నారు.

ముస్లింలకు రంజాన్ కానుక


రంజాన్ కానుక అందజేస్తున్న దృశ్యం

సోమశిల: అనంతసాగరం మండలం బొమ్మవరం పంచాయతీ అగ్రహారంలో దాతలు అక్కలరెడ్డి భాస్కర్‌రెడ్డి, అక్కలరెడ్డి నారాయణరెడ్డి స్థానిక ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకను అందజేశారు. బియ్యం, చెక్కెర, సేమియా, పప్పులు పంపిణీ చేశారు. బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు కృష్ణారెడ్డి, బి సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు మేకపాటి విజయ సంకల్పయాత్ర

సీతారామపురం (ఉదయగిరి): మండలంలోని నెమళ్లదిన్నె, జయపురం, దేవిశెట్టిపల్లి పంచాయతీల్లో మంగళవారం సాయంత్రం మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్ప యాత్ర నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ హరినారాయణన్


కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కావలి: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. సోమవారం కావలి పాతవూరులో ఉన్న మున్సిపల్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను కావలి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి శీనానాయక్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లందరూ ఎలాంటి అసౌకర్యం లేకుండా ఓటు వేసేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. సి-విజిల్, 1950 కాల్ సెంటర్లకు వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీసి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్, డీఈ సాయిరాం, సెక్టోరల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, బీఎల్వోలు ఉన్నారు.